


డి. నారాయణవర్మ

ఝీంకార్రావుకు కండక్టర్ మీద, సుందరిమీద మండు కొచ్చింది.

'వెధవది! ఎక్స్‌ప్రెస్ బస్ కండక్టర్ అయినంత మాత్రాన వాడికంత తెగ నీలు గెందుకో! వే నేం అన్నామా?.... అనకాపల్లికో టిక్కెట్ ఇవ్వమని. వినయంగానే అడిగాను.

పోతే నాకున్న సమస్యల మూలంగా నాలుగ్గైదుసార్లు అదుర్దాగానే రెట్టించాను. కనీసం స్టాండింగ్ అయినా ఫర్వాలేదని రిక్వెస్ట్ చేశానే! ఆ మాత్రం దానికి మనిషంత మనిషిని పట్టుకొని మంచీ చెడ్డా లేకుండా నానామాటలంటాడా! కామన్‌సెన్స్ లేదంటాడా! గడ్డం కాస్త పెరిగి, తలమాసి, నలిగిన బట్టలతో వున్న నా ఆకారాన్ని చూసి అండర్ ఎస్టిమేట్ చేస్తాడా! మేవర్‌లెస్ ఫెలో! ఏది స్టయిల్ పాడుగానూ! ఖాళీ

లేదని మెల్లగా చెబితే సరిపోయే దిగా!'

ఓంకార్రావు మొహానికి పట్టిన చెమటను తుడిచేసుకున్నాడు.

'సరే-వాడు మూర్ఖుడూ, మనిషిని అంచనా వేయలేని హీనుడూ కాబట్టి తిట్టాడమకో. కాని సుందరికేం పొయ్యేకాలం వచ్చిందంట—నన్ను అవహేళన చేయడానికి? నవ్వితే అందంగా సొట్టలు పడే బుగ్గలు, గుండ్రని మోముపై మన్న ఎఱ్ఱటి బొట్టు, ఉంగరాల తలనుండి రేగిన ముంగురులు ఆమె అందానికి మరింత శోభ కలగజేయవచ్చు. ఎక్స్‌ప్రెస్‌లో కిటికీ ప్రక్క కూర్చొని, సైడ్వ్‌మీద చేయి వుంచుకొని హుందా ఒలకబోసే సౌకర్యం కలిగుండవచ్చు. అయితే మాత్రం నన్నంత హీనంగా చూడాలా? కండక్టర్ తిడుతూంటే నా మొహం మాడిపోవడం, నలుగురి ఎదుట తలెత్తలేక చిన్న



కథా నిలయం
శ్రీకాకుళం

పోవడం పరీక్షగా గమనించాలా? పోనీ, గమనించింది.... అందుకు సానుభూతి చూపడంపోయి హేళన చేయడమేమిటి? ఆ నవ్వులేమిటి? ఆ తేలిక పాడు చూపులేమిటి? 'ఎక్స్‌ప్రెస్ ఎక్కే అర్హత అందరికీ ఇజీగా లభించదోయ్! అందుకు శాస్త్రయినా పెట్టి పుట్టాలి. ఆ అర్హత మావంటి వాళ్ళకి మాత్రమే' అనే ధోరణిలో భావాల్ని ప్రదర్శిస్తూ తీవివి ఒలకబోయడమేమిటి? ఈమె గొప్పదే కావచ్చు. ఏమైనా అద దానికి అంత అహం పనికిరాదు.'

నర్సీపట్టణం బస్‌స్టాండ్‌లో, సీలేరు-వైజాగ్ ఎక్స్‌ప్రెస్ బస్ వెనకాల విలబడి జరిగిందంతా నెమ రేసుకుంటూ తెగ విచార పడి పోయాడు ఓంకార్రావు.

జరిగిన అవమానాన్ని భరించ లేక కండక్టర్, సుందరిలను తెగ తిట్టుకుంటూంటే హఠాత్తుగా తాండవ - అనకాపల్లి బస్ వచ్చి స్టాండ్‌లో ఆగింది.

"ఆ-నర్సీపట్నం దిగండి బాబూ! రండి - రావాలి. కొండల అగ్ర హారం, మాకవరపాలెం, కన్నూరు పాలెం, తాళ్ళపాలెం, కశింకోట, అనకాపల్లి-రావాలి-రావాలి!" క్లీనర్ కుర్రాడు గట్టిగా అరుస్తూంటే ఓంకార్రావు బస్ దగ్గరకు నడి చాడు వీరసంగా. ఇతను రావడం అంత దూరాన్నుంచే గమనించిన క్లీనర్, "రండి సార్! ఎక్కండి. ఎక్కడికి వెడతారు?" అంటూ వినయంగా అడుగుతూంటే ఓంకా ర్రావు పొంగిపోలేదు. గంభీరంగా చూశాడు.

"అనకాపల్లి!" ముక్తసరిగా చెప్పాడు.

"అనకాపల్లా? ఎక్కండి సార్! ముందు సీట్లో ఖాళీ వుంది." కండ క్టర్ కలుగజేసుకొంటూ చెప్పాడు. అతని అభ్యర్థనతో ఓంకార్రావు ఎగిరి గంతేసి సీటుకోసం పరుగెత్త లేదు. సీరియస్‌నెస్ మొహంనుండి సడలిపోకుండా జాగ్రత్తపడుతూ, "అనకాపల్లి చేరేటప్పటికి టైం ఎంతవుతుందోయ్?" అని అడిగాడు.

కండక్టర్ ఓంకార్రావుని తేరి పార చూసి, ఆ పైన ఎక్స్‌ప్రెస్ వంక చూశాడు.

"అయితే ఇంతకీ మా బస్ గురించి మీ ఉద్దేశ్యం ఏమిటి సార్? మాది పాసింజర్ బస్ కావచ్చు. ప్రైవేట్ బస్ అవొచ్చు. నవాలక్ష వాళ్ళలో ఆగొచ్చు. అంతమాత్రాన ఎక్స్‌ప్రెస్‌ని దృష్టిలో వుంచుకొని మమ్మల్ని తేలికపరచడం మీకు భావ్యం కాదు సార్!"

కండక్టర్ దక్కన్ సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ము లాగేడు.

"సార్! వినండి. ఆ గవర్న మెంట్ ఎక్స్‌ప్రెస్ బస్‌ని మా బస్....ఏదీ — మీరు తేలిగ్గా చూస్తున్న యీ పాసింజర్ బస్ మూడు సార్లు ఓవర్ టేక్ చేసిం దండీ! ముప్పయి సార్లు సైడీయ కుండా ఏడ్పించిందండీ! అంతెం దుకు సార్! ప్రతి రోజూ ఆ బస్ అనకాపల్లి చేరే టైంకి మేమూ చేరుకుంటున్నాం!" సవాల్‌గా కండక్టర్ చెబుతూంటే ఓంకార్రావు సంతోషించ కుండా వుండలేక పోయాడు.

"అంతే నంటావా!" యథా లాపంగా ఓంకార్రావు అన్నది విని, "అంతేనండీ! రండి— ఎక్కండి" అంటూ కండక్టర్ ముందుకు దారి తీయగా ఓం కార్రావు మంత్రముగ్ధునిలా అనుస రించాడు. కండక్టర్ స్వయంగా బస్‌లోకి తీసుకెళ్ళి డ్రైవర్ వెనక భాగాన్నున్న ముందు వరసలో కుడిచేయి సైడ్స్‌మీద వేసుకొనే సౌకర్యం గల సీట్లో కూర్చో బెట్టాడు. ఓంకార్రావు అతని మర్యాదకు మహా యిబ్బంది పడి పోతూ టిక్కెట్ తీసుకున్నాడు.

ఓంకార్రావు కండక్టర్‌ని మన సార దీవించేసి సిగరెట్ వెలిగించు కున్నాడు. కుడిచేతిని సైడ్స్‌మీద తేలిగ్గా వేసి, ఎక్స్‌ప్రెస్ వంక చూశాడు.

కాఫీకి దిగిన ప్రయాణీకులు ఒక్కొక్కరే ఎక్స్‌ప్రెస్ ఎక్క సాగేరు. సుందరి సీట్లో కూర్చొని, ఎడంచేయి సైడ్స్‌మీద వేసి కిళ్ళీ నములుతూ ఎటో చూస్తూ కనిపిం చింది. ఓంకార్రావు అటే దీక్షగా చూస్తూ వుండిపోయాడు. కాసేప టికి సుందరి ఇటు చూసింది.

'ఓ—నువ్వా!' ఆశ్చర్యం చూపులు నిండగా కనుబొమ లెగ రేసింది.

'అవునండి- నేనే!' అన్నట్టుగా ధీమాగా చూశాడు ఓంకార్రావు.

కిళ్ళీతో సగం -ఎర్రబడ్డ పళ్ళు బైటకు కనిపించగా, ఆమె నవ్వు తూన్నట్టుగా ఓంకార్రావు భావించు కున్నాడు.

'ఎందుకలా పళ్ళికిలిస్తావ్! ఇప్పుడు నేనూ కొట్టగలను పోజులు. మీ బస్‌తో సరి సమానంగా మా బస్ వెడుతూంది. సైడ్స్ మీద చేయి వేసుకొనే అవకాశం నాకు వుందొచ్చు.'

'ఇంతకూ నువ్వెక్కిన బస్ ఏమిటి!'

'తాండవ-అనకాపల్లి బస్.'

'అది ఎక్స్‌ప్రెస్సా?'

'పాసింజర్ కావచ్చు, ప్రైవేట్ బస్ కావచ్చు. అయితే ఏం? మీ బస్ కన్నా మా బస్ ఎన్నో సార్లు ముందుకెళ్ళిందట.'

'ఎవరు చెప్పింది?'

'మా కండక్టర్.'

'ఏడిశాడు. మాసిపోయిన యూనిఫాం,పాలిపోయినఅవతారం వాడూనూ! వాడూ ఓ కండక్టరేనా? కండక్టరంటే ఎలా వుండాలి? చూడు-మా వాడెంత బాగున్నాడో?'

'ఇహ పొగడకు. మీ తరహా ఎస్టిమేట్లన్నీ యిలాగే వుంటాయి. సాటి మనిషికి విలువ యివ్వలేని జంతువులు మీరు.'

'పోదంతా ఎందుకు గానీ, యింతకూ నీది పాసింజరేగా! ఒప్పుకోక అలా నీళ్ళు నములుతా వెందుకోయ్? నువు ఔనన్నా కాదన్నా అది పాసింజరే! నీ బ్రతు కెప్పుడూ పాసింజర్ బ్రతుకే! చూడు-మావి ఎప్పుడూ ఎక్స్‌ప్రెస్ జీవితాలు. జీవితంలో వేగం, చొరవ—మా హక్కు భుక్తాలు. అండర్ స్టేండ్ మై డియర్ పూర్ ఫెలో?'

సుందరి హుందా చూపుల భావాలకు, ఓంకార్రావు చూపులు ఓడిపోయాయి. సమాధానం కోసం తడుముకున్నాడు ఓంకార్రావు.

'అవును, నాది పాసింజర్ జీవితమే! ఎదుగూ బొదుగూ లేకుండా పది సంవత్సరాలుగా గుమాస్తా గిరిలోనే పాతుకు పోయాడు తను. గంపెడు పిల్లలతో, నిత్యం రోగం రొప్పులతో చిన్న సైజు ఆస్పత్రిలాంటిది తన ఇల్లు. దినం గడవడంకోసం చేసే ప్రయత్నాలలో అనుక్షణం చీవాట్లు, ఎదురు దెబ్బలు. నెలలు గడిచే చాకిరీలో ప్రతి రోజూ పొరపాట్లు, చెప్పు దెబ్బలు. సంవత్సరాల తరబడి కోరికలను సమాధి చేసేసుకున్నా, అవసరాలకు సరిపడా ఎదగలేని దౌర్భాగ్య చక్రవర్తి. నడి వయసు రాకుండా సమస్యలతో పండిపోయిన వయో వృద్ధుడు. ఆత్మాభిమానం ఏ నాడో చచ్చిపోయింది. అందుకే అదంటే వల్లమాలిన అభిమానం. అర్థం పర్థం లేని ఆవేశం, ఎదటి వాళ్ళ సానుభూతిని కూడా అవహేళనగా భావించడం, నరనరాన్నీ ఇన్‌ఫీరియారిటీ జీర్ణించుకు పోగా ప్రతి దానికీ అనుమాన పడడం—తనకు అలవాటయిపోయింది.'

బ్రతుకు గురించి ఓంకార్రావు ఆలోచిస్తూండే సరికి ఎక్స్‌ప్రెస్ బస్ కదిలింది. ఓంకార్రావు

హఠాత్తుగా ఆలోచనలు కట్టిపెట్టి తీవిగా సుందరివంక చూశాడు. ఎక్స్‌ప్రెస్ పాసింజర్‌ని దాటు కుంటూ ముందుకు వెళ్ళింది. సుందరి ఓంకార్రావుని జాలిగా చూస్తూ కిళ్ళని తుప్న వుమ్మింది. అది తనమీద పడ్డట్టుగానే ఓంకా ర్రావు భావించేడు.

'ఎంత పొగరే పీకు' ఏం చేయలేని విస్సహాయ స్థితిలో సుందరి మీద కలిగిన ఆగ్రహాన్ని కండక్టర్ మీద చూపాడు- "ఏమి టింకా లేటంటవా"

ఎక్స్‌ప్రెస్ వెళ్ళిన రెండు విముషాలకు పాసింజర్ బయలు దేరింది. నర్సీపట్నం దాటేవరకూ రెండెడ్లబండి కన్నా ఘోరంగా నడిచి ఆపైన వేగం పుంజుకొంది.

బస్ పల్లెటూరు దాటి పర్లాంగు దూరం వెళ్ళిందో లేదో, అల్లంత దూరంలో ఎక్స్‌ప్రెస్ వెడుతూ కప్పించింది. ఓంకార్రావు ఒళ్ళు జలదరించింది. రక్తం బుస బుసా పొంగింది. పిడికిలిబలంగా ముడుచు కుంది. వెర్రి ఆవేశంతో వూగి పోయాడు.

"ఒరేయ్ నూకాల్లీ! అదిగోరా ఎక్స్‌ప్రెస్! మొన్న ఆ కండక్టర్ ఏదో కూశాడు గదరా! ఓ పట్టు పట్టి చూడరా!" పని గట్టుకుని డ్రైవర్ దగ్గరికొచ్చి కండక్టర్ అంటూంటే ఓంకార్రావు కళ్ళు చమర్చాయి. హఠాత్తుగా ప్రమో షన్ వచ్చినంతగా సంబరపడి పోయాడు. కండక్టర్‌కు చేతులెత్తి మొక్కాలన్న భక్తి విశ్వాసాలు కలగ్గా మురిపెంగా అతని వంక చూశాడు.

'ఊ-కానీయ్! స్పీడ్ హెచ్చించు నూకాల్లీ!' ఓంకార్రావు మనసు గీ పెట్టింది. కండక్టర్ మరోసారి హెచ్చరిక చేయగా నూకాల్తల్లి వేగాన్ని పెంచాడు. బస్ తారు రోడ్‌ని దూసుకుపోతూంటే ఓంకా ర్రావు మనసు ఆనందంతో గంతులు వేయసాగింది.

'ఊ-తొక్కు-యాక్సిలేటర్ బలంగా తొక్కు-. స్టీరింగ్ గట్టిగా పట్టుకో! హారన్ కొట్టవోయ్. లాగించు మరీ! అబ్బ! ఓపిక లేనట్టుగా ఏమిటా డ్రైవింగ్! ఇదిగో నీకు చేత కాదంటే చెప్పు- నే వచ్చి సాయం చేస్తాను. అదిగో-అదిగదిగో ఎక్స్‌ప్రెస్‌కు దగ్గరిగా వచ్చేసాం.'

ఓంకార్రావు మనసు ఆత్రుతకు తగ్గట్టుగా డ్రైవర్ వెర్రి ఆవేశం ప్రదర్శించాడు. మాకవరపాలెం వచ్చేసరికల్లా పాసింజర్ ఎక్స్‌ ప్రెస్‌ను కలుసుకొంది.

బస్‌లు రెండూ సరి సమానంగా పరుగెత్తసాగేయి. సైడివ్వ కూడ దని ఎక్స్‌ప్రెస్ డ్రైవరూ, ఓవర్ టేక్ చేయాలని నూకాలుతల్లీ విశ్వ ప్రయత్నాలు చేయసాగేరు.

వన్-టూ-త్రీ; త్రీ-టూ-వన్—

పాసింజర్ బస్ ఓవర్ టేక్ చేసేదే! ఓంకార్రావు—సుందరి, కండక్టర్‌ల వంక కసిగా చూసి కాల రెగరేసే వాడే కాని, అంతలో మాకవరపాలెం రావడం వల్ల, దిగాల్సిన వాళ్ళు ఆపమనటం వల్ల ఓవర్ టేక్ చేయబోయే పాసింజర్ బస్ తక్కున తగ్గి, మెల్లగా ఆగింది. ఎక్స్‌ప్రెస్ ఝామ్మున ముందుకు వెళ్ళి పోయింది.

నీరు కారిపోయాడు ఓంకార్రావు. ఆపమన్న కండక్టర్ మీద, ఆపిన నూకాలుతల్లి మీద, దిగే ప్రయాణీకుల మీద, ఆ వూరి మీద చివరకు తన మీద అసహ్యం పుట్టుకు రాగా తెగ విసుక్కున్నాడు. అస్పష్టంగా గొణుగుతూ తిట్టేశా డందర్నీ!

కళ్ళు మూసుకొని, తల పట్టు కొని కుతకుతా వుడికిపోయాడు ఓంకార్రావు. మరి చేసేదేం లేక సీటు వెనక్కి జేరబడి, సైడ్వ మీద చేయి తీసేసి అనాలోచితంగా వుండిపోయాడు. మాకవర పాలెంలో ప్రయాణీకులు దిగడం, మరికొందరు ఎక్కడం జరిగాక ఫుల్ సీటర్ కెపాసిటీతో బస్ బయలుదేరింది. వూరు దాటేసరి కల్లా ఓంకార్రావుకు నిద్ర ముంచు కొచ్చింది.

తిరిగి హఠాత్తుగా కళ్ళు విప్పే సరికి ప్రయాణీకుల గుసగుసలు, కేకలు వినిపించాయి. ఓంకార్రావుకి ఏం అర్థం కాలేదు. కళ్ళు నలుపు కొంటూ వెనక్కి తిరిగాడు. బస్‌లో కొందరే ప్రయాణీకులు వున్నారు. మిగతా వాళ్ళంతా క్రిందకు దిగారు.

"ఏం జరిగింది?" ఓంకార్రావు ఆతృతగా అడిగాడు.

"యాక్సిడెంటయింది." ఎవరో చెప్పగా ఓంకార్రావు గుండె గుభేల్ మంది.

"మన బస్‌కి యాక్సిడెంట యిందా?" భయంగా చూశాడు.

"మన బస్ కాదు-ఎక్స్‌ప్రెస్."

"ఎక్స్‌ప్రెస్‌కు యాక్సిడెంట యిందా?" కిలో బియ్యం రూపా యికి దొరికినంత సంతృప్తి పడ్డాడు ఓంకార్రావు.

ఓంకార్రావు హుషారుగా సిగ రెట్ వెలిగించుకున్నాడు. బస్ దిగాడు. వెనకాల చెట్టుకు గుద్దు కున్న ఎక్స్‌ప్రెస్ కనిపించింది.

"ఎవరికైనా దెబ్బలు తగిలాయా?" అని అడిగాడు బస్ దూపి వస్తున్న ప్రయాణీకుల్ని. అతని ప్రశ్నలో సుందరికి దెబ్బలు తగిలివుండాలన్న కసి, తతిమ్మా వారెవ్వరికీ తగిలి వుండకూడదన్న సానుభూతి వున్నాయి.

"ఎవ్వరికీ తగల్లేదు. అంతా అదృష్టవంతులు. చెట్టుకు గుద్దుకున్నందున యింజన్ పాడయిందంతే" అని చెప్పారు.

సుందరికి చిన్న దెబ్బ కూడా తగలనందుకు తెగ బాధ పడిపోయాడు ఓంకార్రావు. అయినా ఓ సారి వెళ్ళి సుందరి మొహాన్ని చూసి, కసి తీర్చుకొని రావాలన్న తలంపుతో ముందు కదుగేశాడు. సగం దూరం వెళ్ళినవాడల్లా, సూకాల్లి బస్ స్టార్ట్ చేయడంతో, కండక్టర్ రమ్మని కేక వేయడంతో వెనక్కి రాక తప్పలేదు. బస్ కదలబోతూండగా ఎక్స్ప్రెస్ కండక్టర్ వేగంగా పరుగెత్తుకొచ్చాడు. అతని వెనక సుందరి బాగ్‌తో వచ్చింది.

ఆ కండక్టర్ ఏం అడిగాడో, యీ కండక్టర్ ఏం జవాబుచెప్పాడో యింజను హోరులో ఓంకార్రావు వినలేకపోయాడు. కాని ఎక్స్ప్రెస్ కండక్టర్-మొహం యింతచేసుకొని చిన్నబోవడంతో ఓంకార్రావు తెగ సంతోషించాడు. కండక్టర్ రైట్ చెప్పక పోవడంతో డ్రైవర్ ఇంజను ఆపుచేశాడు. అప్పుడు సుందరి మాటలు స్పష్టంగా వినిపించాయి.

"ఏమండీ-ఏమండీ! నన్నొక్కదాన్నే తీసుకెళ్ళండి! అర్జంటుగా వైజాగ్ వెళ్ళాలండి!" బ్రతిమాలసాగింది సుందరి.

"అబ్బ! లేదని ఎన్నిసార్లు చెప్పాలి? ఖాళీవుంటే మిమ్మల్నేం ఖర్మ-మొత్తం అందర్నీ లాక్కుపోదును. ఒకసారి చెబితే వినిపించుకోవాలి. లేదు-లేదమ్మా తల్లీ! లేదని చెప్పక మరేం చేయమంటారు!" కండక్టర్ విసుక్కుంటూంటే ఓంకార్రావు మనసు ఆనందంతో ఎగిరి గంతులువేసింది.

'అదీ....అదీ వరస. ఛస్తే ఎక్కించుకోకు. నన్ను ఎలా చూపిందనుకున్నావు? చూపులతో నన్ను హేళన చేసిందోయ్! మనని పాసింజర్ బ్రతుకులుగా చిత్రించిందోయ్! జీవితంలో వేగం, చొరవ మా హక్కంటూ, మాని ఎక్స్ప్రెస్ జీవితాలంటూ చూపిందోయ్! ఇదిగో-అడదని జాలిపడి ఎక్కించుకొన్నావా నీ సంగతి అనకాపల్లిలో చూస్తాను-జాగ్రత్త!' లో లోపలే

అనుకుంటూ చెవులు నిక్కబొడుచు కొని ఆచే చూడసాగేరు.

సుందరి ప్రాధేయపడడం మాన లేదు. కళ్ళల్లో నీళ్ళు నింపుకొంటూ దీనంగా చేతులెత్తి కండక్టర్‌కి నమస్కారం చేసేసింది.

"ఏమండీ-ఏమండీ! మీకు పుణ్య ముంటుంది నన్ను తీసుకెళ్ళండీ! నే పీ రోజు వైజాగ్ మూడగంటల కల్లా చేరలేకపోతే నా బ్రతుకు శూన్యం అయిపోతూందండీ! రాక రాక వచ్చిన ఇంటర్వ్యూకి హాజ రవుతున్నానండీ. మాది చాలా పెద్ద కుటుంబం సార్! మా ఇంటికి నేనే పెద్దదాన్ని. వున్నదంతా నా కోసం ఖర్చుచేసి చదివించారండీ. ఈ ఇంటర్వ్యూ తప్పిపోయిందా మరి నాకు యీ జన్మకు వుద్యోగం దొరకదండీ! ఎలాగయిన, తీసు కెళ్ళండీ! చచ్చి మీ కడుపున పుడ తానండీ! ప్లీజ్-ప్లీజ్!"

సుందరి ఆ భ్యర్థన వింటూ ఓంకార్రావు మౌనం వహించాడు. తతిమ్మా ప్రయాణీకు లందరూ ఏకమై సానుభూతి చూపించారు. కండక్టర్‌ని మందలించారు. దాంతో కండక్టర్ వుగ్రుడై పోయాడు.

"చెబుతారయ్యా-వినేవాడుంటే మీరంతా నీతులూ చెబుతారు, ఉప న్యాసాలూ యిస్తారు. ఎక్కించు కోవడం నాకు ఇష్టంలేదనుకున్నారా! కాని లైన్‌లో ఆర్.టి.ఒ. వున్నా డట. సీటర్ కెపాసిటీకి ఒక్క టిక్కెట్ అదనంగా వున్నా వుద్యో గం పోతుందయ్యా! అప్పుడు మీలో ఏ ఒక్కరి సానుభూతి, ఈ అమ్మాయికి చేసిన సహాయం నాకు కూడు పెట్టవయ్యా! సరే— ఈమెను తీసుకెళ్ళాలనేగా మీ రనేది. అలాగే తీసుకెడతాను. కాని, ఇప్పుడు నీతులు చెప్పిన మీలో ఎవరో ఒకరు దిగి యీమె నెక్కించ చండి. అంతేగాని వూరికే కబుర్లు చెప్పకండి!"

కండక్టర్ చెప్పింది అంతా శ్రద్ధగా విన్నారే తప్ప ఏ ఒక్కరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

కండక్టర్ అందర్నీ కలగలిపి తిట్టేశాడు.

తిట్టుకుంటూనే రైట్ చెప్పాడు. డ్రైవర్ ఇంజన్ స్టార్టు చేశాడు.

అప్పటివరకూ మౌనంగా సుందరి వంక చూస్తూ వుండి పోయిన ఓంకార్రావు తేరుకుని హడావిడిగా బస్ దిగాడు.

"అదేమిటి సార్! మీరు దిగు తున్నారు?" కండక్టర్ ఆశ్చర్యం ప్రకటించాడు.

ఓంకార్రావు సమాధానం యివ్వ లేదు.

సుందరి దగ్గరే కెళ్ళాడు.

"మేడమ్! బస్ ఎక్కండి. వెళ్ళినా సీట్లో కూర్చోండి. టిక్కెట్ తీయనక్కర్లేదు. అనకాపల్లి మంచి వైజాగ్ వెళ్ళేందుకు కావల్సినన్ని బస్‌లు వుంటాయి. సకాలంలో మీరు వైజాగ్ చేరగలరు. ఊ- ఎక్కండి" అన్నాడు మెల్లగా. అంతేకాని సుందరి కళ్ళల్లోకి కసిగా చూడలేక పోయాడు ఓంకార్రావు.

"థాంక్సు! మెనీ మెనీ థాంక్స్! మీ సహాయం ఎప్పటికీ మర్చిపోలేను." సుందరి రెండు చేతులెత్తి నమస్కరించింది. కళ్ళతో, ఎన్నెన్నో విధాలుగా కృతజ్ఞతలు తెలియ బరుస్తూన్నా ఓంకార్రావు ఆమె వంక సూటిగా చూడలేక పోయాడు.

'ఇది ఎక్స్‌ప్రెస్ కాదు మేడమ్ పాసింజర్! అయినా ఇది వేగంగా వెడుతూంది. మీరు వైజాగ్ సకాలంలో చేరేందుకు తోడ్పడుతుంది. ఎక్స్‌ప్రెస్ వేగంవంటి జీవితాలకు- ఓర్పుకు అలవాటయిన పాసింజర్ బ్రతుకులు ఎప్పుడూ కాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు సహకరించవచ్చు. హోదా, హుందా కాదు మనిషికి కావలసింది-ఓర్పు, సానుభూతి, జాలి—మనిషి జీవిత గమనంలో అవసరమౌతూంటాయి. ఇది అర్థంచేసుకొంటే చాలు! దీనిని నేను త్యాగంగా భావించడం లేదు. హీరో వర్షిప్ కోసం చేసే ప్రయత్నమూ కాదు. వున్నంతలో మనిషిగా, తోటి మనిషికి కాస్తంత చేయూత. అంతే-అంతే!'

ఉద్దేశ్యమున్నా, పైకి అనలేక లోలోపలే అనుకున్నాడు ఓంకార్రావు.

బస్ బయలుదేరింది.

సుందరి—కళ్ళల్లో కృతజ్ఞతలు నింపుకొని విశ్వాసంగా చేయి వూపింది.

ఓంకార్రావు కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

అతని చేయి మెల్లగా గాలిలో తేలియాడింది.

అంతలో అతని కళ్ళకు ఓ వింత దృశ్యం కనబడింది.

చెట్టుక్రింద నిలబడి విచారంతో తెల్లమొహం వేసుకు చూస్తూన్న ఎక్స్‌ప్రెస్ కండక్టర్ని చూస్తూ పాసింజర్ కండక్టర్ కాలరెగరేస్తూంటే—ఓంకార్రావు అతని వైపు ఆశ్చర్యంగా చూసి విభ్రాంత పోయాడు. •